


"ఇదుగో మిమ్మల్నే! ఆ పేపరలా పడేసి, ఇలా నామాట వినండి. నిన్న రాత్రి నాకో పాడుకల వచ్చింది!" అంది శ్రీమతి.

"వస్తే నన్నేం చెయ్యమంటావ్? పేపరు చదవనియ్యకుండా నన్ను డిస్టర్బ్ చేస్తున్నావ్!" అన్నాను విసుగ్గా.

"మీరు నాకు వచ్చిన కల విని తీరాల్సిందే—ఎందుకంటే అది మీకు సంబంధించినది కనుక." అంటూ, నా చేతిలోని పేపరు లాగి బల్లమీద పడేసింది.

"వినక తప్పదా?" అన్నట్లుగా శ్రీమతికేసి చూసేసరికి — విజయసూచకంగా నవ్వేసి, మొదలుపెట్టింది.

"నిన్న సాయంకాలం మనం పార్టీకెళ్లాం కదూ? — సరిగ్గా అదే దృశ్యం. మన తెలుగువాళ్ళం అందరం కలిసి, సరదాగా మాట్లాడుకొంటున్నాం. అంతలో, ఓ అందమైన పంజాబీ యువతి మన మధ్యకి తిన్నగా వచ్చేసి, మిమ్మల్ని ముద్దు పెట్టుకొంది! మీ తలలో వేళ్ళుపెట్టి, "డియర్ రావ్! నీకోసం నేనక్కడ వెయ్యికళ్ళతో కాసుకూర్చుంటే నువ్విక్కడ మీవాళ్ళతో మాటలెట్టుకొని కూర్చున్నావా? పద పోదాం." అంది గోముగా. అక్కడున్న మనవాళ్ళందరూ ఆశ్చర్యపడిపోయారు. నాకు నోటమాట రాక కొయ్యబారి పోయాను. అయితే నేను తేరుకొని మీ చెయ్యి పట్టు

కాని. 'ఎన్నాళ్ళనుండి ఈ భాగవతం?' అని కోపంగా అడిగాను. ఆ యువతి నన్నో తోపు తోసి, మిమ్మల్ని గట్టిగా పట్టుకొంది. అంతే మీరు .... మీరు ....'' శ్రీమతి ఆగింది.

''ఆ తర్వాత?....'' అన్నాను కొంత ఉత్సాహంగా.

''....కుక్కగా మారి ఆమె వెనకాల వెళ్ళిపోయారు. నేను ఏడుస్తూ గోల పెడ్తూంటే, అందరూ నన్నోదారుస్తున్నారు. అంతలోనే మీరు సన్నగా చిక్కిపోయి నీరసంగా లోపలికి వస్తున్నారు. మిమ్మల్ని చూసి ఏదో అనబోయే లోగానే మెలుకువ వచ్చింది''

''ఈ వెధవ కల చెప్పడానికేనా, ఇంత హంగామా చేసింది?''

''కాదు. కాని మీమీద నాకు నిజంగానే అనుమానమేస్తోంది. కొన్ని రోజులుగా, మీ వాలకాన్నిబట్టి చూస్తే మీరు నిజంగా ఏ టక్కులాడి వలలోనో చిక్కుకున్నట్లుగా ఉంది. ఏమండీ, నిజం చెప్పండి. లేకపోతే అటువంటి కల నాకెందుకు రావాలి?''

''ఎందుకు వచ్చిందో, చెప్పనా?'' అన్నాను. ''సరే'' అన్నట్లుగా తల ఊపింది.

''నేనెవరికో దాసుణ్ణి కావటం లేదు. నీలోని మూర్ఖత్వానికి, స్వార్థానికి లొంగిపోతున్నాను. అదుగో....మూతి అలా పెట్టక, నే చెప్పేది విను. ఏదో మొగవాణ్ణి కనుక నాకు కొంత స్వేచ్ఛ ఉండాలి. ఏదో ఆఫీసు స్నేహితులతో ఓ ఆదివారం ఇంగ్లీషు సినిమా చూస్తే, ఇంట్లో ఎవరో కాలం చేసినంతగా ఏడుస్తావ్. ఆ ఏడుపు భరించలేక ఇంగ్లీషు సినిమాలు చూడ్డం మానుకొన్నాను. హిందీ సినిమాల కెడ్తే, చంటి వెధవ అవసరాలకి వస్తే నువ్వు కుర్చీలోంచి కదలవు. ఆ పాట్లన్నీ నేనే పడ్తున్నాను. పులిని చూసి నక్క వాత పెట్టుకొన్నట్లుగా....పక్కింటి మిసెస్ గుప్తా పింక్ చీర కొనుక్కుంటే, దానికి రెట్టింపు ధర చీర తెచ్చేవరకూ ప్రాణం తోడేశావ్. ఇలా చెప్పుకొంటూ పోతే లక్షలు. నువ్వు నిద్రపోయినప్పుడు—నీలో, నిద్రాణితమైన మంచి మేల్కొంది. అదే కలలోని నువ్వు. నేను పైన చెప్పిన దుర్గుణాలన్నీ మూర్తీభవించి ఆ పంజాబీ యువతిగా మారాయి. అంటే నువ్వు కన్నది—నీ దుర్గుణాలనీ. వాటికి దాసోహం అన్నానన్నమాట. ఇంకా....''

''ఇంకేమీ చెప్పక్కర్లేదు....'' అంటూ శ్రీమతి అక్కణ్ణించి లేచి వెళ్ళిపోయింది.

నేను చెప్పిన వివరణ వింటే, ఫ్రాయిడ్ ఏమనుకొనేవాడో నాకు తెలియదు కాని—రెండు రూపాయలు పెట్టి కొబ్బరికాయ కొన్నప్పుడల్లా. (మేం ఉండేది కోనసీమ కాదు, కాశ్మీరు.) తనకిష్టమయిన కొబ్బరి పచ్చడి చేసే శ్రీమతి, ఆ రోజు నా కిష్టమయిన ''కొబ్బరి కోరూ—శనగపప్పు'' కూర వండింది.